సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం ၊ 17 ၊ ఆగస్టు ၊ 2024



ఉత్పత్తి వ్యయ్యం తగ్గిస్తూ..

బొగ్గు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకుంటూ వార్షిక లక్ష్యం సాధించాలని సింగరేణి సీఎండీ బలరామ్ సూచించారు. 10లో



సమస్యల వలయంలో ఆస్పత్రి

జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రిలో సమస్యలు తిష్టవేయడంతో వైద్యం కోసం వచ్చే ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 26°

వాతావరణం

జిల్లాలో శనివారం ఉదయం అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

మళ్లీ తెరపైకి 'రోళ్లపాడు'



సీతారామ ఎత్తిపోతల పథకం

మొదటి ప్లాన్‌లో అత్యంత కీలకంగా రోళ్లపాడు రిజర్వాయర్

- అభయారణ్యం పేరుతో ఏకపక్షంగా రద్దు చేసిన గత ప్రభుత్వం
- మళ్లీ ప్రతిపాదించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా సీతారామ ప్రాజెక్ట్‌కు భరోసా

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సీతారామ పంప్‌హౌస్ ప్రారంభోత్సవంలో ఈ ప్రాజెక్టులో ఎక్కడా బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ లేకపోవడం అతి పెద్దలోటనే అంశాన్ని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి లేవనెత్తారు. గతంలో రద్దు చేసిన రోళ్లపాడు దగ్గర రిజర్వాయర్ నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. దీంతో మరోసారి రోళ్లపాడు రిజర్వాయర్ తెరమీదకు వచ్చింది.

ఏకపక్షంగా రద్దు

సీతారామ ప్రాజెక్టులో అత్యంత కీలకం రోళ్లపాడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కావడంతో అశ్వాపురం మండలంలో గోదావరి తీరంలో డ్యామ్ నిర్మాణ ప్రదేశాన్ని కాదని మరీ రోళ్లపాడు దగ్గరే సీతారామ ప్రాజెక్టుకు 2016, ఫిబ్రవరి 16న శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత రోళ్లపాడు, కిన్నెరసాని రిజర్వాయర్ల దగ్గర చేపట్టాల్సిన పనుల కోసం టెండర్లు పిలవాలని 2016 మేలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అదే ఏడాది జూలైలో పనులు ఖరారు చేసేందుకు లైడార్ సర్వే చేపట్టింది. ఆ తర్వాత కిన్నెరసాని అభయారణ్యం, కేటీపీఎస్, రైల్వే లైన్లను సాకుగా చూపుతూ ఈ ప్లాన్‌ను ఏకపక్షంగా రద్దు చేశారు. ఆ తర్వాత ములకలపల్లి మండలంలో రెండు పంప్‌హౌస్‌లతో కొత్త ప్లాన్ తెర మీదకు వచ్చింది. అంతేవేగంగా నిర్మాణ పనులు జరిగాయి.

బ్యాలెన్సింగ్ ఎందుకంటే..

గోదావరికి ఏడాదిలో గరిష్టంగా 45 రోజులు వరదలు వస్తాయి. నీటిని ఎత్తి పోసేందుకు అనువైన ప్రవాహం 153 రోజులే ఉంటుంది. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్తగా నీటిని ఎత్తిపోసి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో నిల్వ చేయడం మంచిదనే అభిప్రాయం మంత్రి పొంగులేటి వ్యక్తం చేశారు. దీని వల్ల సీతారామ ప్రాజెక్ట్‌కు భరోసా లభించడంతో పాటు ఇల్లెందు నియోజకవర్గంలో లక్ష ఎకరాల కొత్త ఆయకట్టుతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎస్సారెస్పీ చివరి ఆయకట్టును స్థిరీకరించే అవకాశం ఉంది.

జూలురుపాడు–లలితాపురం– రోళ్లపాడు..

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచనలకు తగ్గట్టుగా రోళ్లపాడులో రిజర్వాయర్ నిర్మించాల్సి వస్తే ఏ ప్లాన్ ప్రకారం ముందుకు వెళ్తారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. పాత ప్లాన్ ప్రకారం ముందుకు వెళ్లడం ఇప్పుడు కష్టమైన అంశంగా మారింది. ఒకవైపు అభయారణ్యం చిక్కులు ఉంటే మరోవైపు రాజీవ్‌సాగర్ కెనాల్‌లో భాగంగా భూమిలో బిగించిన పైపులు బయటకు ఊడబెరికి తీసుకుపోయారు. దీంతో మొదటి నుంచి పనులు చేపట్టాల్సి వస్తుంది. లేదంటే ఇటీవల ప్రతిపాదించినట్టుగా జూలూరుపాడు కెనాల్ ద్వారా ఇల్లెందు శివారులో సింగరేణి మండలం లలితాపురం చెరువుకు నీళ్లను చేరుస్తారు. అక్కడి నుంచి ఎత్తిపోతల ద్వారా రోళ్లపాడు రిజర్వాయర్‌కు చేరుస్తారు.

అనుకూలతలు

జిల్లాలో అత్యంత ఎత్తులో (216 అడుగులు) రోళ్లపాడు ఉంది. ఇక్కడ రిజర్వాయర్‌కు ఆరు కిలోమీటర్ల పొడవు, మూడు కిలోమీటర్ల వెడల్పుతో ఎత్తైన గుట్టలు రక్షణ వ్యవస్థలుగా ఉన్నాయి. పైగా రిజర్వాయర్‌కు సేకరించే భూమిలో 60 శాతం ప్రభుత్వ స్థలాలు ఉన్నట్టుగా సాక్షాత్తు రెవెన్యూ మంత్రి పొంగులేటి ప్రకటించడం మరో అనుకూల అంశం. 16 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించాలని పేర్కొంటుండగా, నిర్మిస్తే ఉమ్మడి జిల్లాలోనే అతిపెద్ద రిజర్వాయర్‌గా మారనుంది.

ముందు ప్లాన్ ఇలా

సీతారామ ప్రాజెక్టు ప్రారంభించినప్పుడు ఇల్లెందు నియోజవర్గంలోనే తొలి అడుగు పడింది. అశ్వాపురం మండలంలో నిర్మించిన ఆనకట్ట ద్వారా గోదావరి నీటిని ఎత్తిపోతలు, గ్రావిటీ కెనాల్ ద్వారా ముందుగా కిన్నెరసాని రిజర్వాయర్‌కు తీసుకువస్తారు. కిన్నెరసాని దగ్గర ఎత్తిపోతలు చేపట్టి అనిశెట్టిపల్లి దగ్గరున్న పాలవాగు చెరువులో పోస్తారు. అక్కడి నుంచి గతంలో రాజీవ్‌సాగర్ ఎత్తిపోతల పథకం కోసం వేసిన భూగర్భ పైపులైన్ల ద్వారా టేకులపల్లి మండలం రోళ్లపాడు చెరువు వరకు చేరుకుంటాయి. రోళ్లపాడు చెరువును బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా మారుస్తూ, నీటి నిల్వ సామర్థ్యం 0.175 టీఎంసీల నుంచి 10.61 టీఎంసీలకు పెంచాలని సీతారామ మొదటి డీపీఆర్‌లో పేర్కొన్నారు. రోళ్లపాడు నుంచి ఒక గ్రావిటీ కెనాల్ ద్వారా బయ్యారం పెద్ద చెరువుకు, మరో గ్రావిటీ కెనాల్ ద్వారా పాలేరు రిజర్వాయర్‌కు నీరు వెళ్తాయి. మరోవైపు జగ్గారం లిఫ్ట్ ద్వారా ఆర్లపెంట కెనాల్ ద్వారా ఇందిరాసాగర్ కిందున్న సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాలకు సాగునీరు వెళ్లాల్సి ఉంది.

వైభవంగా పవిత్రారోపణం



బేడా మండపంలో స్వామివారికి పవిత్రాలను ధరింపజేసి పూజలు చేస్తున్న అర్చకులు

రామయ్యకు ప్రత్యేక స్నపన తిరుమంజనం

భద్రాచలం: భద్రాచల శ్రీ సీతారామ చంద్రస్వామివారి దేవస్థానంలో పవిత్రోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. రామాలయంలో శుక్రవారం పవిత్రారోపణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. తొలుత స్వామివారికి వేద విన్నపాలు జరిపారు. బేడా మండపంలో ఉత్సవమూర్తులకు 108 కలశాలతో అష్టోత్తర శత కలశాభిషేకం, సహస్ర ధారతో ప్రత్యేక స్నపన తిరుమంజనం, ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం హారతి సమర్పించారు. పవిత్రాలను ప్రధాన ఆలయం నుంచి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు జరిపాక మూలమూర్తులకు ధరింపజేశారు. ఆ తర్వాత పవిత్రాలను ఆలయ ప్రాంగణంలో ఉన్న ఉపాలయాలకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. లక్ష్మీతాయారు అమ్మవారికి, ఆంజనేయ స్వామి వారికి భక్తరామదాసు, గోదాదేవిలకు పవిత్రాలను వేశారు. ఆలయానికి, ధ్వజ స్తంభానికి, బలిపీఠానికి, సుదర్శన చక్రానికి పవిత్రాలను ధరింప చేసి అర్చకులు సైతం ధరించారు. గత ఏడాది కాలంలో రామాలయంలో జరిగిన పూజాది కార్యక్రమాల్లో జరిగిన దోష నివారణకు ఈ పవిత్రోత్సవాలను నిర్వహించటం ఆనవాయితీ అని అర్చకులు వివరించారు. ఈఓ రమాదేవికి వస్త్రాలను అర్చకులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ప్రధాన అర్చకులు విజయరాఘవన్, అర్చకులు, వేదపండితులు, ఆలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రతం

దేవస్థానంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారికి అభిషేకం జరిపారు. సాయంత్రం బేడా మండపంలో అమ్మవారిని కొలువుదీర్చి వరలక్ష్మీవ్రతం, సామూహిక కుంకుమార్చన జరిపారు. హాజరైన భక్తులకు ప్రసాదం, సారెలను అందచేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళా భక్తులు పాల్గొన్నారు.



రామాలయంలో వరలక్ష్మీవ్రతం ఆచరిస్తున్న మహిళలు

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి వైభవంగా పంచామృతాభిషేకం



అమ్మవారికి పంచామృతాభిషేకం చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి)ఆలయంలో శుక్రవారం అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతం అభిషేక పూజలు, పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలతోపాటు కుంకుమ పూజ, గణపతిహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఎస్.రజనీకుమారి భక్తులు పాల్గొన్నారు.

19న చండీహోమం

పెద్దమ్మతల్లి ఆలయంలో ఈ నెల19న చండీహోమ పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ ఎస్.రజనీకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. పూజల్లో పాల్గొనే భక్తులు రూ.2,516 చెల్లించి గోత్రనామాలను నమోదు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 63034 08458 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నేడు, రేపు ఆస్పత్రుల్లో ఓపీ సేవలు బంద్

కొత్తగూడెంరూరల్: కోల్‌కతాలో మహిళా డాక్టర్‌పై అత్యాచారంచేసి, హత్యచేయడాన్ని నిరసిస్తూ జిల్లాలోని సర్వజన ఆస్పత్రి, ఎంసీహెచ్, ప్రైవేట్ ఆస్పత్రుల్లో శనివారం, ఆదివారాల్లో ఓపీ సేవలను నిలిపివేయనున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎ.భాస్కర్, కార్యదర్శి డాక్టర్ సీహెచ్.రాజశేఖర్ అయ్యప్ప, డాక్టర్ వి.ప్రవీణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓపీ సేవలను అందించకుండా వైద్యులు నిరసన కార్యక్రమాలు చేపడతారని పేర్కొన్నారు. అత్యవసర సేవలు మాత్రమే కొనసాగుతాయని తెలిపారు.

జమలాపురంలో ముగిసిన పవిత్రోత్సవాలు



శ్రీవారిని చక్రస్నానానికి తోడ్కొని వస్తున్న అర్చకులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో పవిత్రోత్సవాలు మూడో రోజైన శుక్రవారం ముగిశాయి. ఈసందర్భంగా శ్రీవారి పాదానికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించాక, యాగశాలలో మహాపూర్ణాహుతి, స్వామికి చక్రస్నానం చేయించారు. కాగా, పవిత్రోత్సవాలకు పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఈఓ కె.జగన్మోహన్‌రావు, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేలైన్ అలైన్‌మెంట్ మార్చాలని వినతి



ఎంపీ రఘురాంరెడ్డితో మాట్లాడుతున్న నాయకులు

ఖమ్మంరూరల్: డోర్నకల్ – మిర్యాలగూడ రైల్వేలైన్ అలైన్‌మెంట్ మార్పునకు కృషి చేయాలని వివిధ గ్రామాల రైతులు, నాయకులు కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పాలేరు నియోజకవర్గంలోని నేలకొండపల్లి, కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మంరూరల్ మండలాల మీదుగా రైల్వేలైన్ వెళ్లనుండడంతో విలువైన వ్యవసాయ భూములను కోల్పోవాల్సి వస్తోందని తెలిపారు. అలాకాకుండా ప్రత్యామ్నాయ మార్గంలో నిర్మించేలా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరగా ఎంపీ రైల్వే జీఎం, కేంద్రమంత్రితో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్, సీపీఐ నాయకులు బెల్లం శ్రీను, కొప్పుల చంద్రశేఖర్, పోట్ల యుగంధర్, ఉప్పల్‌రావు, సుధాకర్, రాము పాల్గొన్నారు.

ట్రైబల్ టూరిజం పెరిగేలా చర్యలు

కలెక్టర్ జితేష్ వి.పాటిల్



మ్యూజియంలో విల్లు ఎక్కు పెట్టిన కలెక్టర్ జితేష్

భద్రాచలం: భద్రాచలంలో ట్రైబల్ టూరిజానికి ఆదరణ పెరిగేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. శుక్రవారం భద్రాచలంలో ఐటీడీఏ ప్రాంగణంలో ఉన్న ట్రైబల్ మ్యూజియాన్ని ఆయన సందర్శించారు. ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలకు సంబంధించిన కళాకృతులు, వస్తువులను ఆసక్తిగా వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ సీతారామ చంద్రస్వామి కొలువై ఉన్న భద్రాచలానికి పలు రాష్ట్రాల నుంచి భక్తులు, పాపికొండలను తిలకించడానికి పర్యాటకులు వస్తారని, వారంతా ట్రైబల్ మ్యూజియంను సందర్శించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. భద్రాచలం వచ్చే టూరిస్టులకు ఆదివాసీ సంప్రదాయ కళాకృతులు, చరిత్ర, జీవన విధానాలు తెలిసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ నరసింహారావు, ట్రైబల్ మ్యూజియం ఇన్‌చార్జ్ వీరస్వామి, చలపతి తదితరులు పాల్గొన్నారు.

కాగిత రహితంగా కార్యకలాపాలు

సింగరేణి సీఎండీ బలరామ్



సింథటిక్ లాన్ టెన్నిస్ కోర్టును ప్రారంభిస్తున్న సింగరేణి సీఎండీ బలరామ్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో కార్యకలాపాలన్నీ కాగిత రహితంగా మార్చాలని సీఎండీ బలరామ్ సూచించారు. సింగరేణి ప్రధాన కార్యాలయంలో నూతనంగా నిర్మించిన భవనంలో ఐటీ, ఈఆర్‌ఏ శాఖల కార్యాలయాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఎంప్లాయ్ పర్సనల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ వైబ్‌సైట్‌ను కూడా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ వెబ్‌సైట్‌లో ఉద్యోగుల సీఎంపీఎఫ్ గ్రాట్యుటీ, ఇంక్రిమెంట్స్, ట్రాన్స్‌ఫర్, సెలవుల తదితర వివరాలు పొందుపరచాలని చెప్పారు. ఉద్యోగి ఫోన్ నంబర్‌కు జీతం స్లిప్‌లను పంపించాలన్నారు. సంస్థలో పేపర్ వర్క్ లేకుండా చూడాలన్నారు.

ఆరోగ్య రక్షణకు క్రీడలు..

ఆరోగ్య పరిరక్షణకు క్రీడలు దోహదనపడతాయని సీఎండీ పేర్కొన్నారు. కొత్తగూడెం కార్పొరేట్ పరిధిలోని గెస్ట్‌హౌస్‌లో రూ. 38 లక్షలతో నిర్మించిన సింథటిక్ లాన్ టెన్నిస్ కోర్టును ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలను ప్రోత్సహించడంలో సింగరేణి సంస్థ ముందు వరుసలో ఉంటుందన్నారు.

ఆంగ్లభాషపై పట్టుసాధించాలి

ఆంగ్లభాషపై పట్టు సాధించాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ సూచించారు. శుక్రవారం బెంగళూరుకు చెందిన తలియోలా ఇన్ఫోటెక్ సంస్థ డిజిటల్ లింగ్విస్టిక్ మెంటల్ (డీఎల్‌ఎం) ద్వారా రూపొందించిన సాఫ్ట్‌వేర్ కలిగిన బీసీఏ డేటా సైన్స్ కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థినులు ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకుని పోటీ పరీక్షల్లో రాణించాలని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో డైరెక్టర్లు ఎన్వీకే శ్రీనివాస్, నారాయణరావు, పి.వెంకటేశ్వరరెడ్డి, అధికారులు సుభాని, బీఆర్ దీక్షితులు, దామోదర్‌రావు, సూర్యనారాయణ, రవికుమార్, మనోహర్, వెంకటరమణ, సుబ్బారావు, నికోలస్, రాజశేఖర్, రాజీవ్ కుమార్, కోడురు శ్రీనివాస్‌రావు, జాకీర్ హుస్సేన్, మహిళా కళాశాల ప్రిన్సిపాల్ శారద తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న 'రింగ్‌బండ్' పనులు

పెదవాగు ప్రాజెక్టు వద్ద సాగుతున్న పనులు



సాగుతున్న రింగ్‌బండ్ నిర్మాణ పనులు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మడవల్లి వద్ద ఉన్న పెదవాగు ప్రాజెక్ట్‌లో చేపట్టిన రింగ్‌బండ్ నిర్మాణ పనులు ఎట్టకేలకు ఊపందుకున్నాయి. వర్షాలు తగ్గడంతో నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. గత నెల 18న కురిసిన భారీ వర్షాలతో వరద పోటెత్తడంతో ప్రాజెక్ట్ ఆనకట్టకు భారీగా గండ్లు పడిన సంగతి తెలిసిందే. ప్రాజెక్టు కింద తెలంగాణ ప్రాంతంలో సాగు చేసే పంటలకు ఈ సీజన్‌లో సాగు నీరు అందించేలా ప్రభుత్వం తక్షణమే రూ.3.5 కోట్లను కేటాయించింది. ఈ నిధులతో పెదవాగు ప్రాజెక్టు ఆనకట్ట లోపల భాగంలో తాత్కాలికంగా మట్టితో రింగ్‌బండ్ నిర్మిస్తున్నారు. పనులను గత నెల 27న ప్రారంభించగా, వర్షాల కారణంగా ముందుకు సాగలేదు. గడిచిన వారం రోజులుగా వర్షాలు లేకపోవడంతో రాత్రి, పగలు యుద్ధప్రాతిపదికన పనులు నిర్వహిస్తున్నారు.

'సాదాబైనామా'లను క్రమబద్ధీకరించాలి

- 'ధరణి' లోపాలు కొత్తచట్టంలో పునరావృతం కావొద్దు
- రౌండ్‌టేబుల్ సమావేశంలో రైతు సంఘాల నాయకులు



సమావేశంలో పాల్గొన్న రైతు సంఘాల నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సాదాబైనామాపై భూముల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన నూతన రెవెన్యూ ముసాయిదా బిల్లుపై రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్ర నరేంద్రకుమార్ అధ్యక్షతన శుక్రవారం శేషగిరి భవన్‌లో రైతు సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు అన్నవరపు సత్యనారాయణ, ముత్యాల విశ్వనాథం, ఏపూరి బ్రహ్మం, కనగాల అనంతరాములు, ఊక్లా నాయక్ మాట్లాడుతూ గతంలో సాదాబైనామాల క్రమబద్ధీకరణ కోసం దాదాపు 9.5 లక్షల మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారని, అప్పుడు దరఖాస్తు చేసుకోని వారికి కూడా మరో అవకాశం కల్పించాలని కోరారు. ధరణిలో చోటుచేసుకున్న లోపాలు నూతన చట్టంలో పునరావృతం కావొద్దని, 2020లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెచ్చిన ధరణి వల్ల రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చే కొత్త రెవెన్యూ చట్టంలో ఎలాంటి లోపాలు లేకుండా రాష్ట్ర రైతాంగానికి ఉపయోగపడేలా ఉండాలన్నారు.

రీ సర్వే చేయాలి

భూములన్నీ రీసర్వే చేసి రికార్డుల్లోకి ఎక్కించాలని కోరారు. భూమి సాగు చేసుకుంటున్న పేద, చిన్న, సన్నకారు రైతుల పేర్లు రికార్డులలోకి ఎక్కించి పాసు పుస్తకాలు మంజూరు చేయాలన్నారు. ఏజెన్సీలో పోడు సాగు చేసుకుంటున్న వేలాదిమందికి ఇంకా పట్టాలు రాలేదని, వారందరికీ తక్షణమే పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తరతరాలుగా సాగు చేసుకుంటున్న జంగ్ సిపాయి భూములు, దేవాదాయ భూములకు పాసు పుస్తకాలు ఇవ్వాలన్నారు. గ్రామాల్లో ఆబాదీ గ్రామకంఠం భూములన్నీ ఎవరి ఆధీనంలో ఉంటే వారికి రెవెన్యూ రికార్డులలో పేర్లు ఎక్కించి హక్కులు కల్పించాలన్నారు. ప్రతి రైతుకు, ప్రతి కమతానికి భూఆధార్ కార్డులు మంజూరు చేసి, వారికి వ్యవసాయ రుణాలు సులభంగా మంజూరయ్యేలా నూతన రెవెన్యూ చట్టంలో మార్పులు చేయాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘాల నాయకులు సలిగంటి శ్రీనివాస్, చిరుమామిళ్ల వెంకటేశ్వరరావు, కుమారి హనుమంతరావు, కమటం సురేష్, పద్దం విజయలక్ష్మి, వాడే లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విజృంభిస్తున్న జ్వరాలు

- జిల్లాలో 103 డెంగీ, 59 మలేరియా కేసులు నమోదు
- రోగులతో కిక్కిరిస్తున్న ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు



భద్రాచలం ప్రభుత్వాస్పత్రిలో వైరల్ జ్వరాలతో చికిత్స పొందుతున్న రోగులు

భద్రాచలంఅర్బన్: జిల్లాలో వైరల్ జ్వరాలతోపాటు డెంగీ, మలేరియా జ్వరాలు విస్తరిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతోపాటు ఏజెన్సీలో వరదలు వచ్చిన నేపథ్యంలో వైరల్ జ్వరాలు డెంగీ, మలేరియా కేసులు ఇంకా పెరుగుతాయని వైద్యారోగ్య శాఖ భావిస్తోంది. అధిక సంఖ్యలో డెంగీ కేసులు నమోదవుతండటం ఆందోళన కలిగిస్తోంది. జ్వర బాధితుల్లో అధికంగా శరీర ఉష్ణోగ్రత, జలుబు, విరేచనాలు, దగ్గు, ఒళ్లునొప్పులు, అలర్జీ, తలనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. జిల్లాలో ఈ యేడాది ఇప్పటివరకు 107 డెంగీ, 59 మలేరియా కేసులు నమోదయ్యాయి. ఇవి అధికారిక లెక్కలు మాత్రమే. ఇక ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వివరాలు సేకరిస్తే బాధితుల సంఖ్య ఎక్కువగానే ఉంటుంది.



ఈ ఫొటోలో కనిపిస్తున్న బాలుడి పేరు లలిత్ మోహన్. వయసు 9 ఏళ్లు. నివాసం చర్ల. వారం రోజుల నుంచి జ్వరం, వాంతులతో బాధపడుతుండగా ఈ నెల 14న అర్ధరాత్రి భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. ప్లేట్‌లెట్ల సంఖ్య 1.50 లక్షలకు పడిపోయాయని, డెంగీ పరీక్ష చేయాలని వైద్యులు చెప్పారు. 15న సెలవు దినం కావడంతో రక్త పరీక్షలు నిర్వహించలేదు. శుక్రవారం ఉదయం డెంగీ పరీక్షకు సంబంధించిన శాంపిల్స్‌ను తీసుకుని కొత్తగూడెం టీ–హబ్‌కు పంపారని, రిపోర్టులు శనివారం వస్తాయని వైద్యులు తెలిపినట్లుగా బాలుడి తండ్రి ప్రసాద్ పేర్కొన్నారు. అలాగే సుజాతనగర్ మండలానికి చెందిన 11 నెలల చిన్నారి డెంగీ జ్వరంతో కొత్తగూడెంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో చికిత్స పొందుతోంది.

ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీ

ప్రస్తుతం జిల్లాలో ఇంటికి ఒకరిద్దరు చొప్పున జ్వరాలతో బాధ పడుతున్నారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు రోగులతో కిక్కిరిసిపోతున్నాయి. ఇదే అదనుగా ప్రైవేట్ ఆస్పత్రులు ఫీజులు, టెస్ట్‌ల పేరుతో వసూళ్లు చేస్తున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడమే ఇందుకు కారణమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

20వేల కన్నా తగ్గితేనే..

సాధారణంగా ఆరోగ్యవంతుని శరీరంలో ప్లేట్‌లెట్ల సంఖ్య 1.5 లక్షల నుంచి 4 లక్షల వరకు ఉంటుంది. డెంగీ బారినపడితే వీటి సంఖ్య తగ్గుతుంది. 20 వేల కన్నా తగ్గితేనే ప్లేట్‌లెట్లు ఎక్కించాల్సి ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఎక్కువశాతం మందిలో ప్లేట్లెట్ల సంఖ్య తగ్గుదల ప్రారంభమైన మూడు రోజుల తర్వాత నుంచి పెరుగుతుందని, దీంతో ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఏమీ లేదని పేర్కొంటున్నారు.

పలువురి మృత్యువాత

డెంగీ జ్వరంతో ఈ నెల 12న ములకలపల్లి మండల పరిధిలో వర్కా లీలావతి (47), భద్రాచం ఆస్పత్రిలో ములుగు జిల్లా వెంకటాపురం మండలం రాచపల్లికి చెందిన వెంకటేశ్ (31) మృతి చెందారు. జ్వరంతో ఈ నెల 8న అశ్వాపురం మండలం బట్టీల గుంపునకు చెందిన తాటి రజిత (32), ఈ నెల 2న గుండాల మండలం చంద్రాపురం గ్రామానికి చెందిన కొర్సా కమల్‌హాసన్(28) మృతి చెందారు.

జ్వరాలన్నీ డెంగీ కాదు



ప్రస్తుత సీజన్‌లో జిల్లాలో ఫ్లూ జ్వరాల వ్యాప్తి కనిపిస్తోంది. రెండు రోజులకు మించి జ్వరం ఉంటే రక్తకణాలు తగ్గిపోతాయి. అంతమాత్రాన డెంగీ అనలేం. డెంగీ, మలేరియా కేసులు నమోదైన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాం. జ్వరం ఎక్కువగా ఉంటే ప్రభుత్వాస్పత్రిలో చేరి చికిత్స పొందాలి. ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

–డాక్టర్ భాస్కర్ నాయక్, ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ

క్లుప్తంగా

అంతర్జాతీయ చెస్ పోటీల్లో ప్రతిభ



నాగసాయి శశాంత్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఎంవీ శ్రీనివాసరెడ్డి

పాల్వంచ: అంతర్జాతీయ చెస్ పోటీల్లో నవభారత్ పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థి నిడమనూరి నాగసాయి శశాంత్ సత్తా చాటాడు. ఇటీవల విజయవాడలో జరిగిన అంతర్జాతీయ అండర్–13 విభాగం చెస్ పోటీల్లో నాగసాయి శశాంత్ పాల్గొని 1,456 పాయింట్స్ రేటింగ్‌తో ప్రతిభ కనబర్చాడు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో ప్రిన్సిపాల్ ఎంవీ శ్రీనివాస రెడ్డి, చెస్ కోచ్ అన్వర్, తల్లిదండ్రులు బాలకృష్ణ, నాగలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

సర్వీస్ రైఫిల్‌తో కాల్చుకుని హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్య

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో ఘటన

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఓ పోలీస్ హెడ్ కానిస్టేబుల్ తన సర్వీస్ రైఫిల్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బీజాపూర్ జిల్లా భైరంగఢ్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న అప్కా సోనూ శుక్రవారం ఉదయం 9 గంటల సమయాన విధుల్లో ఉండగా తన సర్వీస్ రైఫిల్‌తో కాల్చుకున్నారు. దీంతో కుప్పలికూన ఆయన్ను సహచరులు బీజాపూర్‌కు తరలించే క్రమంలో మృతి చెందాడు. అయితే, సోనూ ఆత్మహత్యకు కారణాలు తెలియకపోగా, ఘటనను బీజాపూర్ ఎస్పీ జితేంద్రకుమార్ యాదవ్ ధ్రువీకరించారు.

నిషేధిత గుట్కా ప్యాకెట్లు పట్టివేత

పాల్వంచరూరల్: కిరాణా దుకాణంలో విక్రయిస్తున్న నిషేధిత గుట్కా ప్యాకెట్లను పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. బస్వతారకకాలనీలో కిరాణా దుకాణంలో శుక్రవారం ఏఎస్‌ఐ సుధాకర్ తనిఖీ చేయగా రూ.2,050 విలువ గల నిషేధిత గుట్కా ప్యాకెట్లు లభించాయి. వాటిని స్వాధీనం చేసుకుని, యజమాని డి.అశోక్‌కుమార్‌పై కేసు నమోదు చేశారు.

మైదానంలో మట్టి తవ్వకాలపై ఫిర్యాదు

అశ్వారావుపేటరూరల్: క్రీడా మైదానంలో అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేసిన ఘటనపై శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు అందింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నారంవారిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో గత ప్రభుత్వ హయంలో క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేసి, క్రీడా పరికరాలను అమర్చారు. కాగా, రెండు రోజుల కిందట కొందరు వ్యక్తులు రోడ్డు మరమ్మతుల పేరుతో క్రీడా మైదానంలో జేసీబీతో మట్టి తవ్వకాలు చేసి తరలించారు. దీంతో మట్టి తవ్వకాలు చేపట్టిన ఎనిమిది మంది వ్యక్తులపై స్థానిక పంచాయతీ కార్యదర్శి బట్టా వెంకటేశ్వర్లు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఏఎస్సై యాకూబ్‌అలీని వివరణ కోరగా.. ఫిర్యాదు వచ్చిందని విచారణ చేస్తున్నట్లు చెప్పారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని వీడీవోస్ కాలనీలో బంధువుల ఇంటికి వచ్చిన ఓ మహిళ మెడలో గొలుసును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. భద్రాద్రి జిల్లా పాల్వంచకు చెందిన రాజ్యలక్ష్మి ఇటీవల వీడీవోస్ కాలనీలోని తన బంధువుల ఇంటికి వచ్చింది. శుక్రవారం రాత్రి ఆమె పనిపై బయటకు వెళ్లి వస్తుండగా ఇద్దరు వ్యక్తులు బైక్‌పై చేరుకుని ఆమె మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు గొలుసు లాక్కుని పోయారు. ఇంతలో తేరుకున్న రాజ్యలక్ష్మి కేకలు వేస్తుండగానే వారు పారిపోవడంతో బాధితురాలు ఖమ్మం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రూ.లక్షల్లో పొదుపు నగదు స్వాహా

పోస్టాఫీస్‌లో ప్రైవేట్ వ్యక్తి ప్రమేయంపై విచారణ

వైరారూరల్: పోస్టాఫీస్‌లో ఖాతాదారులు డిపాజిట్ చేసిన పొదుపు నగదు(ఆర్డీ)ను ప్రైవేట్ వ్యక్తి రూ.లక్షల మేర స్వాహా చేశాడు. పోస్ట్‌మెన్ తనకు బదులు సదరు వ్యక్తిని నియమించడంతో ఇదే అదనుగా కుంభకోణానికి పాల్పడ్డాడు. వైరా మండలం గొల్లపూడి బ్రాంచ్ పోస్టాఫీస్‌ను పోస్ట్‌మెన్ మేడూరి శ్రీనివాసరావు గ్రామంలో తన ఎరువుల దుకాణం పక్కనే ఒక షటర్‌లో ఏర్పాటు చేశారు. ఆ కార్యాలయంలో వరికూటి ప్రవీణ్‌కుమార్‌ను నియమించగా ఆయన ఖాతాదారులు రోజువారీ, నెలవారీ చెల్లించే నగదును మెయిన్ బ్రాంచ్‌లో జమ చేయకుండా స్వాహా చేశాడు. ఇందులో పలువురికి పాస్‌బుక్కులో స్టాంపులు వేయగా.. ఇంకొందరికి పాస్‌బుక్కులే ఇవ్వలేదు. ఇలా 50 మంది ఖాతాల్లో నుంచి రూ.లక్షల మేర నగదు జమ కాలేదని తెలియడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మధిర పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, కలకోట బ్రాంచ్ పోస్టుమెన్ మూడు రోజులుగా గొల్లపూడిలో విచారిస్తున్నారు. పోస్ట్‌మెన్ తనకు బదులు ప్రైవేట్ వ్యక్తిని నియమించడంతో ఇలా జరిగినట్లు తెలుస్తుండగా.. పూర్తిస్థాయిలో విచారించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్యల వలయంలో ఆస్పత్రి



కొత్తగూడెంలోని జిల్లా సర్వజన ఆస్పత్రి

- పని చేయని వెంటిలేటర్లు
- జిల్లా ఆస్పత్రిలో మందుల కొరత
- ఫీవర్ సీజన్‌లో లేని పారాసిటమాల్
- ఇబ్బందులు పడుతున్న రోగులు

కొత్తగూడెంరూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రిలో సమస్యలు తిష్ట వేశాయి. ఆస్పత్రికి వచ్చే ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రిలో ప్రధానంగా వెంటిలేటర్లు ఒక్కటి కూడా పని చేయటం లేదు. రోగులకు అత్యవసర సమయంలో కృతిమ శ్వాస అందించాల్సి వస్తే తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆస్పత్రిలో 20 వెంటిలేటర్లు ఉన్నాయి. ఇందులో ఒకటి, రెండు వెంటిలేటర్లు గతంలో అడపాదడపా పనిచేసేవి. ప్రస్తుతం ఒక్క వెంటిలేటర్ కూడా పని చేయటం లేదు. వైద్య కళాశాల పరిధిలోని సర్వజన ఆస్పత్రిలో 250 పడకలు ఉన్నాయి. ప్రతీ రోజు 500 నుంచి 700 వరకు ఓపీ ఉంటుంది. కానీ, ఐసీయూలు లేవు. రామవరంలోని ఎంసీహెచ్‌లో కూడా ఒక్క వెంటిలేటర్ లేదు. ఐసీయూ విభాగం లేదు. ఈ ఆస్పత్రికి జిల్లా నలుమూలల నుంచి రోజూ 300 మంది వస్తారు.



పనిచేయని వెంటిలేటర్లు ఇవే

ప్రాణాపాయ సమయంలో కృతిమ శ్వాస అందించేందుకు వెంటిలేటర్ లేకపోవడం వల్ల కొందరు మృతిచెందుతున్నట్లు తెలుస్తోంది. ఇక్కడి ఆస్పత్రికి వస్తున్న రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నప్పటికీ, వెంటిలేటర్ అవసరం ఉన్నవారిని వరంగల్ ఆస్పత్రికి పంపిస్తున్నారు. కరోనా సమయంలో జిల్లా ఆస్పత్రికి కొన్ని వెంటిలేటర్లు ఇచ్చారు. కానీ, వాటిని ఇన్‌స్టాల్ చేయలేదు. గతంలో ఉన్న కొన్ని వెంటిలేటర్లకు మరమ్మతులు చేయాలంటే బయోకెమికల్ ఇంజనీర్ కావాలి. ఈ పోస్టు ఖాళీగా ఉంది. ఇక్కడి ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ రాధామోహన్ ఈ విషయం డీఎంఈ దృష్టికి తీసుకు వెళ్లినా ఫలితం లేకుండా పోయింది.

ఇంజెక్షన్లు, మందుల కొరత

అసలే సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో ముందులు, ఇంజక్షన్ల కొరత ఉండటంలో ఆస్పత్రికి వస్తున్న రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు నెలల నుంచి పారాసిటమాల్ ఇంజక్షన్‌తోపాటు ఇతర పెయిన్ కిల్లర్ ఇంజక్షన్లు అందుబాటులో లేవు. ప్రతీ నెల వీటి వినియోగం ఎంతగానో ఉంటుంది. వీటితో పాటు యాంటీబయోటిక్‌లు, గ్యాస్ సంబంధిత మాత్రలు సైతం లేకుండా పోయాయి.

బదిలీ అయిన ప్రొఫెసర్ల స్థానాలు ఖాళీ..

డీఎంఈ పరిధిలోని సర్వజన ఆస్పత్రిలో ఇటీవల అసిస్టెంట్ ప్రొఫెసర్లు సునీల్‌దత్, సురేందర్, పుష్పలత, శిరీష్, వెంకటేశ్ బదిలీ అయ్యారు. కానీ, వీరి స్థానాల్లో ఒక్కరు కూడా రాలేదు. ఈ ఆస్పత్రిలో ఆఫ్తాల్మిక్ అసోసియేటస్ ప్రొఫెసర్ కేశవరావు ఉన్నప్పటికీ, కంటి ఆపరేషన్ చేసే పరికరాలు, ఆపరేషన్ థియేటర్ లేకపోవడం వల్ల కంటి వైద్యం అందడం లేదు. యూరాలజీ వైద్యులు చంద్రప్రకాష్ విధులకు రాకపోవడం వల్ల, కిడ్నీ రోగులకు వైద్యం అందడం లేదు. వీరు ఎప్పుడో ఒకసారి విధులకు హాజరవుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

సమస్యలు పరిష్కరిస్తాం..



జిల్లాలోని సర్వజన ఆస్పత్రి, ఎంసీహెచ్ ఆస్పత్రుల్లోని సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తాను. ఆస్పత్రుల్లో వెంటిలేటర్లు ఏర్పాటు చేస్తాం. ఆస్పత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం. ఏ సమస్య వచ్చినా నా దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. వైద్యుల పోస్టులను కూడా తర్వలోనే భర్తీ చేస్తాం.

– రాజ్‌కుమార్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్

రేకుల షెడ్‌లో ఇన్‌పేషెంట్లు



ఆస్పత్రిలో అవస్థలు

అశ్వారావుపేట: అశ్వారావుపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగుల అవస్థలు వర్ణనాతీతం. గతంలో సీహెచ్‌సీగా ఉన్న ఈ ఆస్పత్రిని గత ప్రభుత్వం ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసింది. కానీ, వైద్యులు, సిబ్బంది, మౌలిక వసతుల ఏర్పాటు జరగలేదు. స్థానిక లక్ష్మీతులసి పేపర్‌మిల్లు సీఆర్‌ఎఫ్ నిధులతో ఏళ్ల తరబడి గదుల నిర్మాణం చేపడుతున్నారు. దీంతో రేకుల షెడ్‌లలో.. కిక్కిరిసిన ఓపీలో రోగులు నిలబడలేక నానా అవస్థలు పడుతున్నారు. జ్వరపీడితులు మండుటెండలో క్యూలైన్‌లో నిల్చోవాల్సి వస్తోంది. పేరుకే ఆస్పత్రిలో ఆరుగురు వైద్యులున్నట్లు చూపిస్తున్నా.. కేవలం ఒక డాక్టర్ మాత్రమే విధుల్లో ఉంటారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఇక్కడ పనిచేస్తున్న స్టాఫ్‌నర్సులు వేరే ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఆ తర్వాత ఇక్కడకు ఎవరూ రాకపోవడంతో డిప్యూటేషన్‌పై వచ్చినవారితో సేవలు అందిస్తున్నారు. ఆస్పత్రిలో మంచాల కొరత, సౌకర్యాల కొరత, సిబ్బంది కొరతతో రోగులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ విషయాన్ని ఆస్పత్రి వైద్యులు విజయ్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లగా తాను శనివారం నుంచి సెలవు పెట్టడంతో ఇద్దరు వైద్యులను డిప్యూటేషన్‌పై అశ్వారావుపేటకు జిల్లా వైద్యాధికారి పంపనున్నట్లు తెలిపారు.



ఓపీ హాల్‌లో క్యూలో నిలుచోలేక ఇలా..



మురుగు గుంత వద్ద రోగి

కిన్నెరసానిని సందర్శించిన కలెక్టర్



వైల్డ్‌లైఫ్ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి.పాటిల్

పాల్వంచరూరల్: పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిని శుక్రవారం కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ సందర్శించారు. ఈ సందర్భంగా వైల్డ్‌లైఫ్ సిబ్బందితో కొంతసేపు మాట్లాడారు. అనంతరం డీర్ పార్కులోని జింకలను వీక్షించి, జలాశయంలో బోట్ షికారు చేశారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

బూర్గంపాడు: బూర్గంపాడులోని గౌతమిపురం కాలనీకి చెందిన కొమ్ము సంధ్య (24) ఇటీవల పురుగుల మందు తాగగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. ఆమెకు కుక్కునూరు మండలం వింజరానికి చెందిన సుధాకర్‌తో నాలుగేళ్ల కిందట వివాహం జరగగా సారపాకలో ఉంటున్నారు. ఏడాది కిందట సుధాకర్ అనారోగ్యంతో మృతి చెందినప్పటి నుంచి పుట్టింట్లో ఉంటున్న సంధ్య భర్త మరణంతో మనస్తాపానికి గురై ఈ నెల 9న పురుగులమందు తాగింది. కుటుంబీకులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది.

యువకుడు...

ఇల్లెందురూరల్: మండలంలోని మర్రిగూడెం గ్రామ పంచాయతీ కోటన్ననగర్‌కు చెందిన పూనెం రమేశ్ (25) ఈ నెల 2వ తేదీన ఇంట్లో మందలించారన్న క్షణికావేశంలో పురుగులమందు సేవించాడు. గమనించిన కుటుంబ సభ్యులు రమేశ్‌ను ఇల్లెందు ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి కనకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కొమరారం ఎస్‌ఐ సోమేశ్వర్ తెలిపారు.

ఉపాధి హామీ పనుల్లో అవినీతి

- పక్కదారి పట్టిన నిధులు.. చేతివాటం ప్రదర్శించిన మేట్‌లు
- ప్రజావేదికలో వెల్లడైన అక్రమాలు

చండ్రుగొండ: మండలంలో 2023 – 24 ఏడాది జరిగిన ఉపాధి హామీ పథకం పనుల్లో అవినీతి జరిగినట్లు వెల్లడైంది. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం సామాజిక తనిఖీ, ప్రజావేదిక నిర్వహించారు. పంచాయతీల వారీగా జరిగిన ఉపాధి పనులపై బహిరంగా విచారణ నిర్వహించారు. జిల్లా అదనపు డీఆర్‌డీఓ ఎస్.రవి, జిల్లా విజిలెన్స్ అధికారి రమణ, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి అనూష, జిల్లా అంబుడ్స్‌మెన్ ప్రకాష్, జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారి అనిల్‌కుమార్, స్టేట్ రిసోర్స్‌పర్సన్ కొమరయ్య, ఎంపీడీఓ అశోక్ హాజరై విచారణ చేపట్టారు. 392 పనులకు గాను మొత్తం రూ.3.51 కోట్ల నిధులు మంజూరయ్యాయి. కాగా, అనేక పంచాయతీల్లో అవినీతి జరిగినట్లు వెల్లడైంది. దామరచర్లలో రోడ్డుకు ఇరు వైపులా 400 మొక్కలు నాటారు. వీటి రక్షణ కోసం నెలకు కూలీలకు 25 మస్టర్లు ఇవ్వాల్సి ఉండగా, అదనంగా రూ.28 వేలు చెల్లించినట్లు వెల్లడైంది. బెండాలపాడులో ఏడుగురు రైతులు గుంతలు తవ్వకుని కొబ్బరి మొక్కలు నాటుకున్నారు. అందుకు సంబంధించిన రూ.1.66 లక్షలు రైతులకు చెల్లించకుండా మేట్ తన కుటుంబీకులు, పరిచయస్తుల పేరుపై కాజేసినట్లు స్పష్టమైంది. మంగయ్య బంజర్‌లో 252 మంది కూలీలకు రోజువారి వేతనం అధికంగా వచ్చేలా చేస్తానని నమ్మబలికి మేట్ వారి వద్ద నుండి రూ.2.25 లక్షలు కాజేశాడు. మండలంలోని అన్ని పంచాయతీల్లో నాటిన మొక్కల్లో సగానికి పైగా చనిపోయినట్లు తేలింది. ఇందుకు గాను ఉపాధి సిబ్బంది నుంచి రూ.1,40,798 రికవరీ చేయాల్సిందిగా విచారణ అధికారులు ఆదేశించారు. మరో ఆరు పనులపై పూర్తిస్థాయి విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని క్వాలిటీ కంట్రోల్ విభాగానికి సూచించారు. అక్రమాలకు పాల్పడిన ఇద్దరు మేట్‌లపై కేసులు నమోదు చేయించాలని ఎంపీడీఓ బయ్యారపు అశోక్‌కు అధికారులు సూచించారు.



ఉపాధి పనులపై విచారణ జరుపుతున్న అధికారులు

ఇసుక సీజ్



సీజ్ చేసిన ఇసుకను చూపుతున్న ఆర్‌ఐ భద్రు

ములకలపల్లి: అక్రమంగా నిల్వ చేసిన ఇసుక రాశులను రెవెన్యూ శాఖ అధికారులు సీజ్ చేశారు. ములకలపల్లి ఆర్‌ఐ–2 భద్రు కథనం మేరకు.. మండలంలోని సంజీవ్‌పల్లి శివారులో ఇసుక అక్రమంగా నిల్వ చేసినట్లు సమాచారం అందటంతో తహసీల్దార్ పుల్లారావు ఆదేశాల మేరకు దాడులు నిర్వహించారు. ఓ ఇంటి ఎదుట నిల్వ చేసిన సుమారు 8 ట్రాక్టర్ల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు.

అపరాల సాగులో జాగ్రత్తలు

- సరైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి
- మధిర వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తల సూచనలు

మధిర: అపరాలు పంటలైన కంది, పెసర, మినుము పంటలు సాగు చేస్తున్న రైతులు తగిన యజమాన్య పద్ధతులు పాటించాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. తద్వారా అధిక దిగుబడి సాధించొచ్చని చెబుతున్నారు. ఈమేరకు రైతులు పాటించాల్సిన జాగ్రత్తలపై మధిర వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త, హెడ్ డాక్టర్ కె.రుక్మిణీదేవి, శాస్త్రవేత్తలు డాక్టర్ టి.భరత్, కె.నాగస్వాతి వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి.

- ఇనుప ధాతులోపం : తొలకరిలో వేసిన కంది, మినుము, పెసర పైర్లలో అధిక వర్షాల కారణంగా ఇనుప ధాతులోపం కనిపిస్తోంది. ఆకులు పసుపు రంగులోకి మారి ఈనెలు మాత్రం ఆకుపచ్చగా ఉంటాయి. కొన్నిసార్లు ఆకులు మొత్తం తెల్లగా మారి ఎండిపోతాయి. దీని నివారణకు ఫెర్రస్ సల్ఫేట్ 2 గ్రాములను లీటర్ నీటికి కలిపి పైరుపై వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.
- ఫైటోఫ్తైరా ఎండు తెగులు : అధిక వర్షాల కారణంగా ఫైటోఫ్తైరా ఎండు తెగులు ఆశించే అవకాశం ఉంది. ఈ తెగులు సోకితే మొక్కలు పూర్తిగా కానీ కొంతభాగం కానీ ఎండిపోతాయి. ఎండిపోయిన మొక్కలను తొలగించిన కాండం మొదలు భాగం పరిశీలిస్తే గోధుమ వర్ణపు నిలువు చారలు కనిపిస్తాయి. ఈ తెగులు నివారణకు ఎలాంటి మందులు లేవు. కానీ తెగులు వ్యాప్తి చెందకుండా మెటాలాక్సిల్ రెండు గ్రాములను లీటర్ నీటికి లేదా కాపర్ ఆక్సిక్లోరైడ్ మూడు గ్రాములను లీటర్‌ల నీటిలో కలిపి తెగులు సోకిన మొక్కలు, వాటి చుట్టూ మొక్కలు తడిచేలా పోయాలి.
- లద్దెపురుగు : అధిక వర్షాలు ఉన్నచోట సాధారణంగా శాఖీయ పెరుగుదల అధికంగా ఉండి పొగాకు లద్దె పురుగు ఆశించి నష్టపరుస్తుంది. తొలి దశలో లార్వాల నివారణ కోసం థయోడికార్బ్ ఒక గ్రామును లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.



వైరస్ ఆశించిన మినుము పైరు

- పెసర, మినుము, కంది పంటలో హెక్టారుకు నత్రజని 20 కిలోలు, భాస్వరం 50 కిలోలు దుక్కిలో వేయాలి. సూటి ఎరువులు అయిన యూరియా, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ వాడాలి
- పెసర, మినుము పంటలు వేసి 15–20 రోజులు అయితే వర్షాలు ఆగగానే ఇమజితాఫిర్ 250 మి.లీ.ను ఎకరానికి పిచికారీ చేస్తే గరిక, వెడల్పాకు కలుపును సమర్థవంతంగా అరికట్టవచ్చు. కలుపు ముదిరితే మందులు పనిచేయవని గుర్తించి 2–3 ఆకుల దశలోనే పిచికారీ చేయాలి.
- వర్షాలు కురిసిన తర్వాత బెట్ట పరిస్థితులు ఏర్పడితే పెసర, మినుమును రసం పీల్చే పురుగులు ఆశిస్తాయి. అలాగే, తామర పురుగు పైరు లేత దశలో ఆశించి ఆకుల్లో రసాన్ని పీల్చి నష్టాన్ని కలగజేయడమే కాక ఆకుముడుత వైరస్‌ను వ్యాపింపజేస్తాయి. దీని నివారణకు ఫిప్రోనిల్ 1.5 మి.లీ. లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ.ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఎకరానికి 10–15 నీలిరంగు జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవాలి.



ఎండిపోయిన కంది మొక్క

- మినుము, పెసర పూతదశలో మారుకా అనే గూడు పురుగు ఆశించే అవకాశం ఉంది. దీని నివారణకు లీటర్ నీటికి నొవాల్యూరాన్ ఒక మి.లీ. లీటర్ లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ. లేదా ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ. కలిపి పిచికారీ చేస్తే పురుగును నివారించవచ్చు.
- పెసర, మినుము మొగ్గ, పూతదశలో ఉంటే భూమిలో ఎక్కువ తేమ ఉండడం వల్ల పూతరాలిపోయే అవకాశముంది. దీన్ని అరికట్టేందుకు నీటిలో కరిగే పోషక పదార్థాలైన 19:19:19 లేదా మల్టీకే 13:0:45 ను 10 గ్రాములను లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి. అలాగే, ప్లానోఫిక్స్ ఒక మి.లీ.ను 4.5 లీటర్ల నీటికి కలిపి ఒక ఎకరంలో పిచికారీ చేసినా పూత రాలడాన్ని అరికట్టవచ్చు.
- కంది పంటను ఆగస్టు ఆఖరి వరకు విత్తుకోవచ్చు. విత్తడం ఆలస్యమైతే నేలతీరును బట్టి సాళ్ల మధ్య దూరం తగ్గించి మొక్కల సాంద్రత ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. సాళ్ల మధ్య 75–90 సెం.మీ., మొక్కల మధ్య 15 సెం.మీ. ఎడంతో విత్తుకోవాలి.

క్లుప్తంగా...


తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పంకజ్ మిట్టల్, ఏపీ హైకోర్టు న్యాయ మూర్తులు జస్టిస్ చీమలపాటి రవి, జస్టిస్ పి.రాజశేఖర్ శుక్రవారం దర్శించుకున్నారు.

ఎమ్మెల్సీగా బొత్స ఏకగ్రీవ ఎన్నిక



మహారాణిపేట (విశాఖ): స్థానిక సంస్థల కోటాలో ఖాళీ అయిన ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బొత్స సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బొత్సకు రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ శుక్రవారం ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ధ్రువీకరణ పత్రం అందజేశారు. అనంతరం బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల్లో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చిన వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు

వైద్యవిద్య ప్రవేశాలు, ఆసుపత్రుల పర్యవేక్షణకు టాస్క్‌ఫోర్స్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వైద్యవిద్య ప్రవేశాలు, దవాఖానాల్లో వసతుల కల్పనను పర్యవేక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ టాస్క్‌ఫోర్స్‌లో డీఎంఈ సభ్య కార్యదర్శిగా వ్యవహరించనుండగా, డీఎంఈ (అకడమిక్), హెల్త్ వర్సిటీ రిజిస్ట్రార్, ఉస్మానియా, గాంధీ వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లు సభ్యులుగా ఉంటారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, పీజీ సీట్ల ప్రవేశాల ప్రక్రియను టాస్క్‌ఫోర్స్ పర్యవేక్షించనుంది. దీంతోపాటు బయోమెట్రిక్ అటెండెన్స్, ఓపీ, ఐపీ, మాతాశిశు సంరక్షణ సేవలు, పోస్టుమార్టం వంటి అన్ని విభాగాల్లో వసతుల కల్పనపై దృష్టి పెట్టనుంది. నిశితంగా పరిశీలించి, ప్రభుత్వానికి నివేదిక అందజేయనుంది.

ఇస్రో అమ్ములపొదిలోకి మరో రాకెట్

ఎస్ఎస్ఎల్వీ డి-3 ప్రయోగం సక్సెస్

కక్ష్యలోకి సురక్షితంగా చేరిన ఈఓఎస్-08, డెమోశాట్ ఉపగ్రహాలు



సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) అమ్ముల పొదిలోకి మరో రాకెట్ చేరింది. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట సమీపంలో ఉన్న సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్)లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి స్మాల్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్వీ) డి-3 ప్రయోగాన్ని శుక్రవారం ఉదయం విజయవంతంగా నిర్వహించింది. ఈ ప్రయోగం ద్వారా 175.5 కేజీల బరువు కలిగిన ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ (ఈఓఎస్-08), ఎస్ఆర్-0 డెమోశాట్ అనే రెండు ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టింది. ఈ ప్రయోగానికి శుక్రవారం తెల్లవారుజామున 2.47 గంటలకు కౌంట్‌డౌన్‌ను ప్రారంభించారు. అరున్నర గంటలపాటు కౌంట్‌డౌన్ అనంతరం ఉదయం 9.17 గంటలకు ఎస్ఎస్ఎల్వీ డి-3 రాకెట్ నింగివైపునకు దూసుకెళ్లింది. రాకెట్‌లోని మొత్తం నాలుగు దశలు సక్రమంగా పనిచేయడంతో 16.56 నిమిషాల్లోనే ప్రయోగం విజయవంతంగా ముగిసింది. భూమికి 475 కిలోమీటర్ల ఎత్తులోని లియో ఆర్బిట్ (సూర్య సమకాలిక కక్ష్య)లో 37.2 డిగ్రీల వృత్తాకారపు కక్ష్యలోకి విజయవంతంగా ఉప గ్రహాలను ప్రవేశపెట్టారు. మొదట ఈఓఎస్-08ను కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టారు. ఆ తర్వాత ఎస్ఆర్-0 డెమోశాట్ అనే చిన్న ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. కక్ష్యలోకి చేరిన ఉపగ్రహాల నుంచి సిగ్నల్స్ అందడంతో శాస్త్రవేత్తలు సంతోషం వ్యక్తంచేశారు. ఇప్పటివరకు ఇస్రో చిన్న తరహా ఉపగ్రహాలను పీఎస్ఎల్వీ రాకెట్ల ద్వారా ప్రయోగించి వాణిజ్యపరంగా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందింది. ఇప్పుడు ఎస్ఎస్ఎల్వీ రాకెట్ అందుబాటులోకి రావడంతో వాణిజ్య పరమైన ప్రయోగాల్లో తిరుగులేని శక్తిగా ఇస్రో ఎదుగుతుందని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

ఇవీ ఉపయోగాలు...

ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్-08లో ఎలక్ట్రో ఆప్టికల్ ఇన్‌ఫ్రారెడ్, గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టం-రిఫ్లెక్టోమెట్రీ, ఎస్ఐసీ యూవీ డొసిమీటర్ అనే మూడు రకాల పేలోడ్స్‌ను అమర్చారు. వీటి ద్వా రా ఈ ఉపగ్రహం భూమి మీద వాతావరణ పరిస్థితులు(భౌగోళిక-పర్యావరణం)పై ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ సమాచారాన్ని చేరవేస్తుంది. ముఖ్యంగా అటవీ, వ్యవసాయం, భూమి స్వభావం, నీరు, నేల తీరు అధ్యయనాలకు సంబంధించిన సమాచారాన్ని అందిస్తుంది. ఇది భవిష్యత్తులో ప్రయోగించనున్న గగన్‌యాన్ మాడ్యూల్‌కు అవసరమైన వాతావరణ పరిస్థితులను కూడా అధ్యయనం చేస్తుంది. మైక్రోశాట్ ఉపగ్రహాల్లో అత్యంత అధునాతన టెక్నాలజీ కలిగిన ఈ ఉప గ్రహం ఒక్క సంవత్సరం మాత్రమే సేవలు అందిస్తుంది.

ఇస్రోకు సరికొత్త రాకెట్ అందుబాటులోకి వచ్చింది

ఇస్రో చైర్మన్ సోమనాథ్



ఎస్ఎస్ఎల్వీ డి-3 ప్రయోగం అనంతరం ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి మాట్లాడుతూ ఇస్రోలో సరికొత్తగా ఎస్ఎస్ఎల్వీ రాకెట్ చేరిందని చెప్పారు. ఇప్పటిదాకా ఎస్ఎల్వీ, ఏఎస్ఎల్వీ, పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ మార్క్-3 వంటి ఐదు రకాల రాకెట్లు మాత్రమే ఉండేవని తెలిపారు. 2022 ఆగస్టు 7న ప్రయోగించిన ఎస్ఎస్ఎల్వీ డి-1 రాకెట్ విఫలం కావడంతో అందులో ఏర్పడిన లోపాలను సరిచేసుకుని పలు ముందస్తు పరీక్షలు నిర్వహించి ఎస్ఎస్ఎల్వీ డి-3 ప్రయోగానికి సిద్ధమయ్యామని పేర్కొన్నారు. దీనికోసం అహర్నిశలు పనిచేసిన ఇస్రోలోని అన్ని విభాగాల టీమ్‌లకు అభినందనలు తెలిపారు వాణిజ్యపరంగా కూడా ఈ రాకెట్‌ను వినియోగిస్తామని చెప్పారు. వెహికల్ డైరెక్టర్ ఎస్ఎస్ వినోద్, శాటిలైట్ డైరెక్టర్ ఎ.అవినాశ్ మాట్లాడుతూ ఉపగ్రహం నుంచి నిర్దేశించిన విధంగా సిగ్నల్స్ అందాయని తెలిపారు. కాగా, ఇస్రో శాస్త్రవేత్తలకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ అభినందనలు తెలిపారు.

కృషి ఫలించింది.. గేటు పడింది

తుంగభద్ర డ్యాం స్టాప్‌లాగ్ గేటు తొలి భాగం అమరిక

- నేడు మరో రెండు భాగాలు ఏర్పాటు


గేటును విజయవంతంగా అమర్చుతున్న దృశ్యం

సాక్షి, బళ్లారి/ హొసపేటె/అనంతపురం సెంట్రల్: వారం రోజులుగా ఇంజినీర్లు చేస్తున్న కృషి ఫలించింది. తుంగభద్ర డ్యాంలో కొట్టుకుపోయిన 19వ గేటు స్థానంలో స్టాప్‌లాగ్ గేట్ ఏర్పాటు విజయవంతంగా మొదలైంది. స్టాప్‌లాగ్ గేట్‌లో మొదటి భాగాన్ని శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో ప్రత్యేక నిపుణుడు కన్నయ్యానాయుడు పర్యవేక్షణలో ఇంజినీర్లు, కార్మికులు విజయవంతంగా అమర్చారు. 15 టన్నులు బరువుతో 4 అడుగుల ఎత్తు, 60 అడుగుల వెడల్పు ఉన్న ఈ భాగాన్ని భారీ క్రేన్ల సాయంతో అమర్చారు. ఇక్కడ మరో నాలుగు భాగాలు అమర్చాల్సి ఉంది. శనివారం రెండు, మూడు భాగాలు అమర్చడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. తొలుత డ్యాం నుంచి 60 టీఎంసీల నీటిని వదిలేసి, 40 టీఎంసీలకు చేరుకున్నాక గేటు అమర్చాల్సి ఉంటుందని నిపుణులు చెప్పారు. అయితే నీటి వృథాను అడ్డుకొని రైతులకు అందించే లక్ష్యంతో స్టాప్‌లాగ్ గేటును అమర్చుతున్నారు. ప్రస్తుతం జలాశయంలో 72 టీఎంసీల నీరు ఉన్నప్పటికీ, మొదటి భాగాన్ని విజయవంతంగా అమర్చారు. మిగిలిన భాగాల ఏర్పాటులో పెద్ద అవరోధాలు ఉండవని డ్యాం అధికారులు తెలిపారు.

భర్తకు జీవిత ఖైదు సరైందే

భార్య హత్య కేసులో ట్రయల్ కోర్టు తీర్పును సమర్థించిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: భార్య హత్య కేసులో భర్తకు ట్రయల్ కోర్టు జీవిత ఖైదు విధించడం సరైందేనని హైకోర్టు స్పష్టం చేసింది. 'మృతిరాలితో అప్పీలెంట్ (భాస్కర్)కు వివాహం జరిగి నాలుగు నెలలే అయ్యింది. ఆమె మంటల్లో కాలిపోతున్నప్పుడు గదిలో నిందితుడు ఉన్నాడని సాక్ష్యులు చెబుతున్నారు. ఆ మంటలను ఆర్పేందుకు అతను ఎలాంటి చర్యలు చేపట్టలేదు. భర్తకు వ్యతిరేకంగా మృతురాలు తప్పుడు వాంగ్మూలం ఇచ్చిందనడానికి ఎలాంటి కారణాలు లేవు. ట్రయల్ కోర్టు తీర్పులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం కనిపించడం లేదు' అని హైకోర్టు తీర్పునిచ్చింది. 2012లో జరిగిన హత్య కేసులో అప్పీలెంట్‌కు జీవిత ఖైదు సరైందేనని 2015లో తేల్చిచెప్పింది. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం... రంగారెడ్డి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన పెద్దింటి భాస్కర్‌కు మృతురాలితో 2012, ఏప్రిల్ 25న వివాహం జరిగింది. వివాహం తర్వాత నెల పాటు దంపతులు భార్య తల్లిగారింట్లోనే ఉన్నారు. 2012, జూలై 15న రాత్రి భోజనం చేసిన తర్వాత నిద్రించారు. అయితే తనకు పీడకలలు వస్తున్నాయని, తల్లి వద్ద నిద్రిస్తానని భాస్కర్‌ను కోరింది. అందుకు నిరాకరించి దుర్భాషలాడుతూ ఆమెపై కిరోసిన్ పోసి నిప్పంటించాడు. కాలిన గాయాలతో ఆమె చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆసుపత్రిలో మృతురాలు మేజిస్ట్రేట్‌కు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా భాస్కర్‌ను ట్రయల్ కోర్టు దోషిగా నిర్ధారించింది.

బాధితురాలి మానసిక స్థితి బాగానే ఉంది...

2015, ఏప్రిల్ 17న రంగారెడ్డి జిల్లా కోర్టు తనకు యావజ్జీవ శిక్ష విధించడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పెద్దింటి భాస్కర్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.సురేందర్, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ జితేందర్‌రావు వీరమల్ల వాదనలు వినిపించారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. మృతురాలి తల్లి కూడా నిందితుడికి వ్యతిరేకంగా సాక్ష్యం ఇవ్వలేదని, పథకం ప్రకారం హత్య చేశాడని నిరూపించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం... బాధితురాలి నుంచి మేజిస్ట్రేట్ వాంగ్మూలం తీసుకునేముందు ఆమె మానసిక పరిస్థితి బాగానే ఉందని డాక్టరు ధ్రువీకరించారని పేర్కొంది. మరణ వాంగ్మూలం ఆధారంగా శిక్ష విధించవచ్చని సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పులను ప్రస్తావిస్తూ అప్పీలును కొట్టివేసింది.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ఫీజు గడువు ఈనెల 30

సాక్షి, హైదరాబాద్: ఓపెన్ స్కూల్ ద్వారా టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షలు రాయాలనుకునే వారు ఈనెల 22 నుంచి 30వ తేదీ వరకు ఫీజు చెల్లించాలని తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ డైరెక్టర్ పీజీ శ్రీహరి తెలిపారు. ప్రతీ పేపర్‌కు రూ.25 అపరాధ రుసుముతో సెప్టెంబర్ 4 వరకు, రూ.50 అపరాధ రుసుముతో సెప్టెంబర్ 9 వరకు ఫీజు చెల్లించాలని వెల్లడించారు. ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు ఈ ఏడాది అక్టోబర్‌లో జరుగుతాయన్నారు. వివరాలకు http://www.telanganaopenschool.org వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

బాబు తప్పిదం వల్లే.. 'వాల్' ఢమాల్

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పోలవరం డయాఫ్రమ్‌వాల్‌పై సీడబ్ల్యూసీకి అంతర్జాతీయ నిపుణుల కమిటీ నివేదిక

2017, 2018లో ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్-2లో డయాఫ్రమ్‌వాల్ మీదుగా వరద ప్రవాహం

- ఆ ప్రభావం డయాఫ్రమ్‌వాల్‌పై పడకుండా ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదన్న కమిటీ
- వరదల ఉధృతికే డయాఫ్రమ్‌వాల్ 693 మీటర్ల పొడవున దెబ్బ తిన్నట్లు స్పష్టీకరణ
- 2017లో ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల పునాదులు జెట్ గ్రౌటింగ్ వాల్‌ల నిర్మాణం
- వరద ప్రభావం వాటిపై పడకుండా ఎలాంటి చర్యలు తీసుకోని టీడీపీ సర్కారు
- 2018 వరదలకు ఎగువ కాఫర్ డ్యామ్‌లో 200 -260 మీటర్ల మధ్య దెబ్బతిన్న జెట్ గ్రౌటింగ్ వాల్

జిల్లా వార్తలు

రామయ్య సన్నిధిలో ప్రముఖులు


ఆలయంలో హైకోర్టుల న్యాయమూర్తులు

భద్రాచలం/బూర్గంపాడు: భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి వారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. రాజస్తాన్, తెలంగాణ హైకోర్టుల జడ్జిలు మున్నూరి లక్ష్మణ్, కాజా శరత్‌తో పాటు మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు విడివిడిగా దర్శించుకుని పూజలు చేశారు. వీరికి అర్చకులు, ఈఓ రమాదేవి సంప్రదాయ రీతిలో స్వాగతం పలికి పూజల అనంతరం వేదాశీర్వచనం, ప్రసాదం అందజేశారు. ఆలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, హైకోర్టు న్యాయమూర్తి కాజా శరత్‌ను కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సారపాకలోని ఐటీసీ గెస్ట్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.

11 అడుగుల కొండచిలువ పట్టివేత


కొండచిలువతో స్థానికులు

రఘునాథపాలెం: మండలంలోని వేపకుంట్లలోని ఓ ఇంట్లోకి 11 అడుగుల పొడవైన కొండచిలువ చొరబడింది. గ్రామానికి చెందిన సుర వీరయ్య ఇంట్లోకి శుక్రవారం కొండచిలువ వెళ్తుండగా గుర్తించిన గ్రామస్తులు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో బీట్ అధికారి కన్నయ్య ఆధ్వర్యాన గోపి తదితరులు దాన్ని బంధించి సమీపంలోని అడవిలో వదిలిపెట్టారు.

గంజాయి కట్టడిలో పోలీసుల పనితీరు భేష్

సమీక్షలో మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, పక్కన ఎస్పీ రోహిత్‌రాజ్, అధికారులు

కొత్తగూడెంరూరల్: గంజాయి అక్రమ రవాణాను అరికట్టడంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసుల పనితీరు మెరుగ్గా ఉందని మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి అభినందించారు. కొత్తగూడెం హేమచంద్రపురంలోని జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో శుక్రవారం ఆయన అధికారులతో సమావేశమయ్యారు. తొలుత జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, కేసుల పరిష్కారం, గంజాయి రవాణా, మావోయిస్టుల కట్టడి అంశాలను ఎస్పీ రోహిత్‌రాజ్ వివరించారు. అనంతరం ఐజీ మాట్లాడుతూ మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పనిచేసే పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని తెలిపారు. అలాగే, పోలీస్‌స్టేషన్ల నిర్వహణ, 5ఎస్ అమలు, సీసీ కెమెరాల ఏర్పాటు, సైబర్ నేరాల కట్టడిపై సూచనలు చేశారు. అనంతరం ఆయన మొక్కలు నాటారు. ఏఎస్పీలు పరితోష్ పంకజ్, అంకిత్‌కుమార్ సంక్వర్, డీఎస్పీలు చంద్రభాను, సతీష్‌కుమార్, రవీందర్‌రెడ్డి, మల్లయ్యస్వామి, ఏఓ జయరాజు పాల్గొన్నారు.

టెన్నిస్ ఆడిన ఐజీ


టెన్నిస్ ఆడుతున్న ఐజీ

పాల్వంచ: పాల్వంచలో ఇటీవల ప్రారంభించిన లాన్ టెన్నిస్ కోర్ట్‌ను ఐజీ పి.చంద్రశేఖర్‌రెడ్డి సందర్శించారు. శుక్రవారం తెల్లవారు జామున కోర్ట్‌కు వచ్చిన ఆయన క్రీడాకారులతో కలిసి కాసేపు టెన్నిస్ ఆడారు. ఈసందర్భంగా ఆయనను అసోసియేషన్ బాధ్యులు, కోచ్‌లు సన్మానించారు. అనంతరం ఐజీ మాట్లాడుతూ యువత క్రీడామైదానాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీఐలు కృష్ణారావు, వినయ్‌కుమార్, ఎస్ఐ సుమన్, టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గంగిరెడ్డి యుగంధర్‌రెడ్డితో పాటు అన్నం వెంకటేశ్వర్లు, భాస్కర్, కబీర్, వంశీ, డాక్టర్ బసవరాజు పాల్గొన్నారు.

తల్లి చెంతకు చేరిన బాలుడు...

అక్రమ దత్తత కథ సుఖాంతం


బాలుడిని తల్లికి అప్పగిస్తున్న అధికారులు

ఖమ్మంవన్‌టౌన్: అక్రమ దత్తత వ్యవహారం కథ ఎట్టకేలకు సుఖాంతమైంది. అయితే, ఈ వ్యవహారంపై దర్యాప్తు చేపట్టాలని సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ భారతీరాణి అధికారులను ఆదేశించారు. మూడేళ్ల క్రితం రఘునాథపాలెంవాసి సాయికి నిజాంపేట ప్రాంతానికి చెందిన స్వప్నతో వివాహం జరిగింది. వీరి కుమారుడు నెలల వయసులో ఉండగానే సాయి రోడ్డు ప్రమాదంలో మరణించగా బాబును తానే పెంచుతానని సాయి తల్లి నాగమణి పెద్దల సమక్షాన ఒప్పుకుంది. కొద్దిరోజులకే శిశువును హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఉద్యోగికి అక్రమంగా దత్తత ఇచ్చింది. ఈ విషయం బయటపడడంతో బాబు తల్లి స్వప్న ఇటీవల ఖమ్మం సీసీఎస్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు బాలుడిని శిశుగృహకు తరలించగా శుక్రవారం తల్లి స్వప్నకు అప్పగించారు. అయితే, పూర్తిస్థాయిలో విచారించి అక్రమ దత్తతలో కీలకంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు.

ఉత్పత్తి వ్యయాన్ని తగ్గిస్తూ లక్ష్యసాధన

- సోలార్ విద్యుత్ వెయ్యి మెగావాట్లకు పెంచేలా కృషి
- లాభాల వాటా, దీపావళి బోనస్‌పై సీఎంతో చర్చిస్తాం
- మణుగూరు ఏరియాలో పర్యటించిన సింగరేణి సీఎండీ బలరామ్


క్యాంటీన్‌లో టిఫిన్ చేస్తూ కార్మికులతో మాట్లాడుతున్న సీఎండీ బలరామ్

మణుగూరుటౌన్: ప్రైవేట్ సంస్థలు, కోల్ ఇండియా నుంచి సింగరేణికి పోటీ ఉన్న నేపథ్యాన కొత్త బ్లాక్‌ల సాధనకు కృషి చేస్తున్నామని, అదే సమయాన బొగ్గు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకుంటూ వార్షిక లక్ష్యాల సాధనకు పాటుపడాల్సి ఉందని సింగరేణి సీఎండీ బలరామ్ తెలిపారు. మణుగూరు ఏరియాలో గురువారం రాత్రి డైరెక్టర్ జి.వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి పర్యటించిన ఆయన ఓసీలోని ఓబీ వెలికితీత, యంత్రాల ద్వారా లోడింగ్‌ను పరిశీలించారు. ఆ తర్వాత శుక్రవారం ఉదయం వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటిన సీఎండీ క్యాంటీన్‌లో కార్మికులతో మాట్లాడారు. కార్మికులు కమిటీగా ఏర్పడి కావాల్సిన అల్పాహారంపై యాజమాన్యం దృష్టికి తీసుకురావాలని సూచించారు. అలాగే, ఒడిశాలోని నైనీ, కొత్తగూడెం వీకే గని, ఇల్లెందులోని రొంపెడు ఓసీ, బెల్లంపల్లి గోలేటి ఓసీలను ప్రారంభించి ఉత్పత్తి లక్ష్యాలను చేరుకుంటామని, సోలార్ ప్లాంట్లను వెయ్యి మెగావాట్లకు చేర్చేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు.

యంత్రాలను 18 గంటలు వినియోగించాలి

ఈ సంవత్సరం 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరేలా ఉద్యోగులు 8 గంటలు పని చేయడంతో పాటు భారీయంత్రాల వినియోగాన్ని 18 గంటలకు పెంచాలని సీఎండీ బలరామ్ సూచించారు. కోల్ ఇండియాలో టన్ను బొగ్గు ఉత్పత్తి వ్యయం రూ.వెయ్యి ఉండగా.. సింగరేణిలో రూ.4 వేలుగా నమోదవుతున్నందున తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. కాగా, లాభాల వాటా, దీపావళి బోనస్, ఇతర ఆర్థిక ప్రయోజనాలపై సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడుతామని తెలిపారు. అనంతరం సింగరేణి స్కూల్‌ను పరిశీలించి గత ఏడాది 100 శాతం ఉత్తీర్ణత సాధనకు కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించిన ఆయన, వచ్చే ఏడాది మణుగూరు సింగరేణి స్కూల్‌లో సీబీఎస్ఈ సిలబస్ అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమాల్లో అధికారులు వెంకటేశ్వర్లు, లక్ష్మీపతిగౌడ్, వీరభద్రరావు, శ్యాంసుందర్, శ్రీనివాస్, రాంబాబు, వీరభద్రుడు, సురేశ్, సలగల రమేశ్, స్వరూపారాణి, షబ్బీరుద్దీన్‌తో పాటు నాయకులు వై.రాంగోపాల్, వి.కృష్ణంరాజు పాల్గొన్నారు.

ఎయిర్‌వాల్వ్, సర్జ్‌షాఫ్ట్ నుంచి నీరు!


కమలాపురం పంప్‌హౌస్-3 వద్ద సర్జ్‌షాఫ్ట్ నుంచి ఎగజిమ్ముతున్న నీరు

ములకలపల్లి: సీతారామ ప్రాజెక్ట్ పంప్‌హౌస్‌ల్లో మోటార్లను గురువారం స్విచాన్ చేయగా.. ఎయిర్‌వాల్వ్ నుంచి నీళ్లు ఎగజిమ్మడం ఫౌంటెన్లను తలపించింది. ములకలపల్లి మండలం పూసుగూడెం శివారులోని పంప్‌హౌస్-2 మోటార్లను గురువారం సీఎం రేవంత్‌రెడ్డి ఆన్ చేసిన విషయం విదితమే. కాసేపటికి అక్కడికి సమీపంలోని ఎయిర్ వాల్వ్ నుంచి గాలితోపాటు నీరు కూడా పైకి ఎగజిమ్మింది. ఇది ఫౌంటెన్‌ను తలపించగా స్థానికులు ఆసక్తిగా పరిశీలించారు. అయితే, మోటార్లను ఆన్ చేసి ఆఫ్ చేశాక గాలి బయటకు వెళ్లే క్రమంలో కొంత మేరకు నీళ్లు రావడం సాధారణమేనని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. కాగా, కమలాపురంలోని పంప్‌హౌస్-3 మోటార్ ఆన్ చేసినప్పుడు కూడా డిశ్చార్జ్ కెనాల్‌కు వెళ్లే మార్గంలోని సర్జ్ షాఫ్ట్ (పైపుల్లో గాలి బయటకు వెళ్లేలా చేపట్టిన ఎత్తయిన నిర్మాణం) నుంచి నీళ్లు విరజిమ్మడం ఫౌంటెన్ మాదిరి కనిపించింది. కొద్దిరోజుల కిందట ట్రయల్ రన్ సమయాన ఈ విషయాన్ని గుర్తించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సర్జ్‌షాఫ్ట్ ఎత్తు పెంచి నీటి వృథాను అరికట్టాలని అధికారులకు సూచించారు.

ఇస్రో కళాశాలలో సారపాక విద్యార్థికి సీటు

ఏరోస్పేస్ ఇంజనీరింగ్ చదవనున్న నీలోఫర్



ఇస్రో కళాశాల వద్ద నీలోఫర్

బూర్గంపాడు: భద్రాద్రి జిల్లా బూర్గంపాడు మండలం సారపాకకు చెందిన షేక్ నీలోఫర్ ఇస్రో పరిధిలో కొనసాగుతున్న ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో సీటు సాధించింది. సారపాకకు చెందిన నన్నేమియా ఐటీసీ పీఎస్‌పీడీలో పర్మనెంట్ కార్మికుడిగా పనిచేస్తుండగా, ఆయన కుమార్తె నీలోఫర్ ఐటీసీ అనుబంధ భద్రాచలం పబ్లిక్ స్కూల్, హైదరాబాద్‌లోని నారాయణ జూనియర్ కళాశాలలో చదివాక ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లోని భిలాయ్ ఐఐటీలో సీటు సాధించింది. ఇంతలోనే ఆమెకు ఇస్రో అనుబంధ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌లో సీటు దక్కింది. ఈ సందర్భంగా నీలోఫర్ మాట్లాడుతూ.. స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీలో రాణించాలన్న తన కల నెరవేరుతుండటం ఆనందంగా ఉందని చెప్పగా.. ఆమెను ఐటీసీ అధికారులు అభినందించారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న పీఓ రాహుల్

భద్రాచలం: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ తరచుగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ సెక్రటరీ శరత్ ఎస్సీ, ఎస్టీ గురుకులాల కార్యదర్శులు అలుగు వర్షిణి, సీతామాలక్ష్మి, అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డి, విద్యాశాఖ డీడీ చందనతో కలిసి పాఠశాలలు, హాస్టళ్ల నిర్వహణపై హైదరాబాద్ నుంచి వీసీ ద్వారా శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. పాఠశాలల్లో, వసతి గృహాల పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్ది, మెనూ అమలుపై దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులు జ్వరాల బారిన పడకుండా తరచూ వైద్యపరీక్షలు చేయించాలని తెలిపారు. అనంతరం భద్రాచలం ఐటీడీఏ నుంచి పీఓ రాహుల్ మాట్లాడుతూ.. వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది సహకారంతో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని వెల్లడించారు. గురుకులాల ఆర్‌సీఓ నాగార్జున్‌రావు, ఏటీడీఓ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.